సాక్షి
మహబూబాబాద్


ఆదివారం | 19 | జనవరి | 2025



కుంభమేళాకు మన రైళ్లు

కుంభమేళాకు మన రైళ్లను నడిపించనున్న నేపథ్యంలో ఈనెల 20నుంచి పలు రూట్లలో పుష్‌పుల్ రైళ్లను అధికారులు రద్దు చేశారు.

- 8లో▸



కామన్‌మెస్‌లో బయోమెట్రిక్

కాకతీయ యూనివర్సిటీలోని కామన్‌మెస్‌లో విద్యార్థులకు శనివారం నుంచి బయోమెట్రిక్ అటెండెన్స్ అమలు చేస్తున్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$32.1^0 / 14.5^0$

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ ఉన్నప్పటికీ చల్లగానే ఉంటుంది. రాత్రి పొగమంచుతోపాటు చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

సర్వే వేగంగా పూర్తి చేయాలి



నెల్లికుదురు: ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సర్వేను వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మండలంలోని నర్సింహులగూడెంలో శనివారం నిర్వహిస్తున్న సర్వేను అధికారులతో కలసి పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ సర్వేను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో నవోదయ ఆరో తరగతికి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈఓ రవీందర్‌రెడ్డి శనివారం తెలిపారు. జిల్లాలో మొత్తం 5 సెంటర్లలో 1,118 మంది విద్యార్థులకు 882 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరైయ్యారని తెలిపారు. 236 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్‌ను సందర్శించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగ అధికారి మందుల శ్రీరాములు, నవోదయ పాఠశాల అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ఉచిత శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ఉన్న మైనార్టీ నిరుద్యోగ యువకులకు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2, 3, 4, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకింగ్ వంటి పోటీ పరీక్షకు నాలుగు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు అర్హులని, దరఖాస్తు ఫారంలు విద్యార్హత పత్రాలతో కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ వరక గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 91825 40680, 95737 69507 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

కోర్టు ఉద్యోగాలకు ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కోర్టులో ఉద్యోగాల నియామకానికి శనివారం పరీక్ష నిర్వహించినట్లు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.సురేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈపరీక్షలో రికార్డు అసిస్టెంట్ పరీక్షకు 139 మందికి, 128 మంది అభ్యర్థులు హాజరయ్యారని, స్టెనో (టైపిస్టు) పోస్టులకు 24 మందికి 15 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలు మహబూబాబాద్ జ్యుడీషియల్ కోర్టు వెబ్‌సైట్‌లో ఉంటాయని, ఈ నెల 30న జిల్లా కోర్టులో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు

- వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మహబూబాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ శాంతికుమారితోకలిసి జిల్లాల కలెక్టర్లతో నూతన రేషన్‌కార్డుల జారీ రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తదితర పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. పథకాల మంజూరి నిరంతర ప్రక్రియ అన్నారు. వీసీలో జిల్లానుంచి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, మానుకోట ఆర్డీఓ కృష్ణవేణి, డీసీఎస్‌ఓ ప్రేమ్‌కుమార్, డీఏఓ విజయనిర్మల, డీపీఓ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తులో యువత



విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు

- సిగరెట్ల రూపంలో సైతం లభ్యం
- జల్సాల కోసం యువత పెడదారి
- మత్తులో నేరాలకు పాల్పడుతున్న వైనం

సాక్షి, మహబూబాబాద్:

- గంజాయికి బానిసైన యువకులు జల్సాలకోసం కొద్దిరోజుల క్రితం మహబూబాబాద్ బస్టాండ్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఆపి డబ్బులు గుంజుకున్నారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సదరు యువకుల కోసం గాలిస్తున్నారు.
- జిల్లా కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన యువకుడు ఉన్నత చదువులు చదివి గంజాయికి బానిసయ్యాడు. గంజాయి లభించనప్పుడు, డబ్బులు లేనప్పుడు అందరిపై రాళ్లువిసరడంతో స్థానికులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువకున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి తల్లిదండ్రులతో మాట్లాడి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి పంపించారు.
- జిల్లా కేంద్రానికి సమీపంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి మత్తులో కొందరు యువకులు రాత్రి వేళల్లో రోడ్డుపై వెళ్లేవారిని ఆపి దాడి చేయడం, వారి వద్ద డబ్బులు లాక్కోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో ఓ బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో స్పందించిన పోలీసులు యువకులను అదుపులోకి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

ఇలా ప్రతీ రోజు జిల్లాలోని ఏదో ఒక చోట ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం, బాధితుల్లో కొందరు పోలీసులకు చెప్పడం, మరికొందరు తల్లిదండ్రులకు చెప్పి హెచ్చరించడం, ఇంకొందరు మౌనంగా ఉన్న సందర్భాలు ఉంటున్నాయి.

యువత గంజాయిని వివిధ రూపాలుగా సేవిస్తూ మత్తులో తేలియాడుతున్నారు. మార్కెట్‌లో దొరికే పలురకాల సిగరెట్లను ఖాళీ చేసి అందులో గంజాయి నింపి నేరుగా విక్రయాలు చేస్తున్నారు. అదేవిధంగా రూ.50 నుంచి రూ.100 చొప్పున విక్రయిస్తున్న గంజాయి ప్యాకెట్లను యువకులు కొనుగోలు చేసి బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లి సిగరేట్లలో, లేదా పేపర్‌తో రోల్‌ను తయారు చేసి వినియోగిస్తున్నారు. అదేవిధంగా మత్తు పదార్థాలతో తయారు చేసిన చాక్లెట్లు, యాష్ లిక్విడ్ వంటి రూపాల్లో జిల్లాలో దొరుకుతుందనే ప్రచారం. ఇలా జిల్లా కేంద్రంలోని పత్తిపాక, హనుమంతుని గడ్డ, సిగ్నల్ కాలనీ, సలార్ తండా ప్రాంతాలతోపాటు డోర్నకల్, మరిపెడ, నెల్లికుదురు నర్సింహులపేట, తొర్రూరు, కేసముద్రం ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం. గంజాయి ఆకు, పువ్వు, లిక్విడ్‌లు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలతోపాటు, భద్రాచలం, అరకు వంటి ప్రాంతాల నుంచి రైళ్లు, కార్లు, ద్విచక్ర వాహనాల ద్వారా జిల్లాకు తెచ్చి గుట్టుచప్పుడు కాకుండా విక్రయకేంద్రాల్లో వేసి వెళ్తున్నారు. ఇటీవల కేసముద్రం, మహబూబాబాద్ పట్టణాల్లో పట్టుబడిన గంజాయి సంఘటనలే ఇందుకు నిదర్శనం.

ఏడాది కాలంగా జిల్లాలో నమోదైన కేసులు	
నమోదైన కేసులు	26
పట్టుకున్న గంజాయి	710.164 కేజీలు
పట్టుకున్న గంజాయి విలువ	రూ.1,77,67,225
సీజ్ చేసిన వాహనాలు	13
విచారించిన వ్యక్తులు	83
అరెస్టయిన వారు	52

యువత, విద్యార్థులే ఎక్కువ

గంజాయి మహమ్మారికి బానిస అవుతున్న వారిలో ఎక్కువగా 14 నుంచి 25 సంవత్సరాల లోపు యువకులే ఎక్కువ. సాయంత్రం కాగానే గ్రామాలు, పట్టణాల్లో యువకులు ఊరిబయట, పట్టణ శివారుతోపాటు బడి, గుడి వంటి నిర్మానుష్య ప్రాంతాల్లోకి వెళ్లి గంజాయి మత్తుతో తూలుతున్నారు. మత్తులో కుటుంబ సభ్యులతో గొడవలకు దిగడం, డబ్బులు కావాలని డిమాండ్ చేయడం పరిపాటిగా మారింది. అదే విధంగా అవసరానికి డబ్బులు లేనప్పుడు దొంగతనాలకు పాల్పడటం శోచనీయం.

అదుపులోకి తీసుకుంటున్నాం..



ఇటీవల గంజాయికి బానిసవుతున్న యువకుల కేసులు వస్తున్నాయి. దీంతో అప్రమత్తం అయ్యాం. అనుమానం వస్తే అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నాం. రైడింగ్‌లు పెంచాం. ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున గంజాయి రవాణాను గుర్తించి కేసులు నమోదు చేశాం. గంజాయి మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రజల సహకారం అవసరం.

- తిరుపతిరావు, డీఎస్పీ మహబూబాబాద్

'కాల్వపల్లి' కన్నీరు

ముగిసిన దామోదర్ ఉద్యమ ప్రస్థానం

- ఎన్‌కౌంటర్‌లో కన్నుమూసిన మావోయిస్టు అగ్రనేత
- రెండు రాష్ట్రాల్లో ఆయనపై రూ.50 లక్షల రివార్డు
- ఇటీవల దామోదర్ తల్లిని కలిసిన ములుగు ఎస్పీ
- లొంగిపోవాలని కొడుకును వేడుకున్న తల్లి
- ఇంతలోనే మృతి చెందినట్లు మావోల ప్రకటన



దామోదర్ (ఫైల్)

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని పూజారి కాంకేర్ నక్సల్స్ క్యాంపుపై భద్రతా దళాలు జరిపిన మెరుపు దాడిలో ములుగు జిల్లా ఎస్ఎస్‌తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన మావోయిస్టు కీలకనేత, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే దామోదర్ అలియాస్ చొక్కారావు మృతి చెందాడు. ఆయన మరణవార్తతో స్వగ్రామం కాల్వపల్లి ఉలిక్కిపడింది. గ్రామంలో చివరి ఉద్యమ కెరటంగా ఉన్న దామోదర్ అసువులుబాయదంతో కాల్వపల్లి మావోయిస్టుల ప్రస్థానం ముగిసినట్టయింది.

- ములుగు/ఎస్ఎస్‌తాడ్వాయి

- 8లో▸

కొర్రీలు పెట్టడమే బీఆర్‌ఎస్ నాయకుల పని

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

కొత్తగూడ: ప్రభుత్వ పథకాలు అమలు కాకుండా కొర్రీలు పెట్టడమే బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పనిగా పెట్టుకున్నారని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారం పోయిందనే అక్కసుతో బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఎద్దేవాచేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో సాహసోపేత పథకాలను విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. గణతంత్ర దినోత్సవం నుంచి రైతు భరోసా, ఏడాదికి రూ.12వేల చొప్పున రైతులకు ఇవ్వబోతున్నామని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కోటీశ్వరులకే రైతు బంధు దక్కిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు పని చేయాలని అన్నారు. గోవిందాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బ్రహ్మచారి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి సీతక్క భూమి పూజ చేశారు. మల్లెల రామయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సీతక్క

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు సహాయపథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆన్‌లైన్‌లో https://ngo. tribal.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోత్ దేశీరాంనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ప్రాజెక్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడానికి వెబ్‌సైట్ అందుబాటులో ఉందని, ఈనెల 19నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్

గూడూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తోందని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. మండలంలోని నక్కబండ, రామరవంచ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ప్రభుత్వ పథకాల విచారణ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 4 సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలో పాల్గొని వ్యవసాయానికి అనువుగా లేని భూములు, నాలాలకు కన్వర్ట్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ భూములు, మైనింగ్ చేస్తున్న భూములతోపాటు తదితర భూములను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. 16 నుంచి 20 వరకు సర్వే జరుగుతుందని, 21 నుంచి 24వరకు గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.



రామరవంచలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

ఎమ్మెల్యేను సన్మానించిన మంత్రి

మహబూబాబాద్ రూరల్: ప్రజాసేవకు అంకితమైన ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ సేవలు అభినందనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు శనివారం నియామక పత్రాలను హైదరాబాద్‌లో అందజేశారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ భూక్య మురళీనాయక్, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి తుమ్మల.. మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎమ్మెల్యే మురళీనాయక్ నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఇదే రీతిలో నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ముద్రవేయాలని, నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న ఎమ్మెల్యేకు తనవంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.



ఎమ్మెల్యే మురళీనాయక్‌ను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పదేళ్ల తర్వాత తెరుచుకున్న బడి

- ప్రారంభించిన ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) శివారు గుజిలి తండాలో పదేళ్లుగా మూతబడిన ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ శనివారం తిరిగి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనలో వేల పాఠశాలలు మూసివేశారన్నారు. ప్రజల సహకారం ఉంటే మూతపడిన పాఠశాలలను తెరిపించే యత్నం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, లేని పక్షంలో వచ్చే పదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలు ఉండవని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, ఎంఈఓలు లచ్చిరాంనాయక్, బాలోజీ, కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్‌నాయక్, శ్రీరాములు, సుధాకర్, కరుణాకర్‌రెడ్డి, వేణు, రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.



బడిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

అప్పల రాష్ట్రంనుంచి అభివృద్ధివైపు..

- ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

కురవి: గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని.. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకెళ్తున్నారని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. సీరోలు మండల కేంద్రంలో రూ.1.43 కోట్లతో నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను, సీసీ రోడ్డును ప్రారంభించారు. కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. బలపాలలో రూ.1.43కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని, నూతన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 26న రైతులకు భరోసా నిధులు జమ, భూమి లేని కూలీలకు రూ.12వేలు అందిస్తామన్నారు. రేషన్‌కార్డులు ఇస్తామని తెలిపారు. మార్చి లేదా ఏప్రిల్‌లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు చెప్పారు. డోర్నకల్‌లో స్కిల్ డెవలప్మెంట్ కోసం అధునాతన టెక్నికల్ కేంద్రం ఏర్పాటు, కురవిలో 30 పడకల ఆస్పత్రికి నిధులు వస్తాయని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. మరిపెడకు కోర్టును తీసుకొస్తామన్నారు. క్షణికావేశానికి ఆత్మహత్యలు చేసుకోవద్దని, మద్యం మాని మంచినీళ్లు ఎక్కువ తీసుకోవాలని సూచించారు. డాక్టర్లు మాధవరావు, స్రవంతిలను సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మురళీధర్, ఈఈ విద్యాసాగర్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు నెహ్రూనాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, మానుకోట మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వెంకటరెడ్డి, డాక్టర్లు స్రవంతి, మాధవరావు, వి.హర్షవర్ధన్‌రెడ్డి, కేశవరావు, రజనికాంత్, రవీందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రంగమ్మ, కరుణాకర్‌రెడ్డి, వెంకన్న, బీకునాయక్ , వెంకటనారాయణ, రమేశ్, హరిలాల్, బాలగాని శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

ఇదిలా ఉండగా.. డీఎస్ రెడ్యానాయక్ ఎమ్మెల్యేగా ఉన్న 2023 అక్టోబర్ 4వ తేదీన శంకుస్థాపన చేసిన పనులకు శనివారం ప్రస్తుత ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ భూమి పూజ చేశారు. అయితే తాము మంజూరి చేసి తీసుకొచ్చి శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించడం మాత్రమే కాకుండా కొత్తపనులకు నిధులు తీసుకురావాలని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి, తదితరులు

మహబూబాబాద్ అర్బన్: మ్యూచువల్ 317 జీఓ ద్వారా వచ్చిన ఉపాధ్యాయుల బదిలీల సర్వీస్ పుస్తకాలు, ధ్రువపత్రాలను పరిశీలించినట్లు డీఈఓ ఏ.రవీందర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. మానుకోట జిల్లా నుంచి 59 దరఖాస్తులు వచ్చాయని, ఇతర జిల్లాల నుంచి 34 దరఖాస్తులు వచ్చాయన్నారు. 13 మంది ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను ముగ్గురు ప్రత్యేక అధికారులతో పరిశీలన నిర్వహించామని, క్రమశిక్షణ చర్యలు, కోర్టు కేసులు, అనధికార సెలవులు ఉన్న వారు బదిలీలకు అనర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉపాధ్యాయుడు ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెరిఫికేషన్ అధికారలు బానోత్ శంకర్ నాయక్, మాలోత్ కొట్యానాయక్, కోటం కనకయ్య, విద్యాశాఖ అధికారులు రాజేశ్వర్, ఉమాహేశ్వర్, సంతోశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో ప్రాణాపాయం

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్

మహబూబాబాద్ రూరల్: అతివేగంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అతివేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై కుటుంబాలకు తీరని దుఃఖాన్ని మిగిల్చుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు నిబంధనలపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా వాహనదారులు కొద్దిరోజులు మాత్రమే అనుసరిస్తూ మళ్లీ యథావిధిగా ప్రవర్తిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రవాణా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురై మరణించిన వారిలో హెల్మెట్ లేకుండా, సీట్ బెల్టు లేకుండా, పరిమితికి మించి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైన వారే అధికంగా ఉన్నారన్నారు. చట్టాలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాల ప్రాణనష్టం ఎక్కువ జరిగే ఆస్కారం ఉంటుందన్నారు.

కేసముద్రం మున్సిపాలిటీగా గెజిట్ విడుదల

- నెరవేరిన ఈప్రాంతవాసుల చిరకాల ఆకాంక్ష



కేసముద్రం వ్యూ

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ ఏర్పాటుకు ఆమోదాన్ని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దీంతో ఈప్రాంతవాసుల ఆకాంక్ష నెరవేరినట్టైంది. కేసముద్రం మున్సిపాలిటీ ఏర్పా టు కోసం కేసముద్రంస్టేషన్, కేసముద్రంవిలేజ్, ధన్నసరి, సబ్‌స్టేషన్ తండా జీపీ, అమీనాపురం గ్రామాల్లో ఇటీవల అధికారులు నిర్వహించిన గ్రామసభల్లో ఏకగ్రీవంగా తీర్మానించిన విషయం తెలిసిందే. నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించగా, అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు రాష్ట్రంలో కొత్తగా 12 మున్సిపాలిటీలను ఏ ర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. ఇందులో భాగంగా కేసముద్రాన్ని మున్సిపాలిటీగా ప్రతి పాదిస్తూ అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే 12 మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఇందులో భాగంగా కేసముద్రం మున్సిపాలిటీ ఏర్పాటుకు ఆమోదముద్ర పడింది. కాగా కొత్తగా ఏర్పా టు కానున్న కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 19,438 మంది జనాభా ఉన్నారు. త్వరలో మున్సిపాలిటీల పరిధిలోని ఓటర్ల జాబితాకు అనుగుణంగా వార్డుల విభజన, రిజర్వేషన్ల కేటాయింపు ఉంటుందని అధికారులు తెలిపారు.

21న జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ హైదరాబాద్ ఆదేశాల మేరకు ఈనెల 21న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారిణి ఓలేటి జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 తేదీన ఉదయం 10గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 94406 30681 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మహిళలు, పురుషులకు వేర్వేరు విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభించిన సీపీ

వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్ పోలీసులకు నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా శనివారం కాజీపేటలోని సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ మైదానంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభించారు. సెంట్రల్ జోన్, అర్మ్‌డ్ రిజర్వ్‌డ్ విభాగాల మధ్య జరిగిన పోటీలను సీపీ ప్రారంభించారు. ఆటగాళ్లను పరిచయం చేసుకొని వారిలో ఉత్సాహం నింపారు.

కేయూ తెలుగు విభాగం ఇన్‌చార్జ్ అధిపతిగా సురేశ్‌లాల్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం ఇన్‌చార్జ్ అధిపతిగా యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ఎకనామిక్స్ విభాగం ఆచార్యుడు బి. సురేశ్‌లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కేయూ తెలుగు విభాగం అధిపతి, బీఓఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ ఏటూరుజ్యోతి ఇటీవల మృతి చెందడంతో ఆ రెండు పదవులు ఖాళీ అయ్యాయి. అయితే తెలుగు విభాగంలో రెగ్యులర్ అధ్యాపకులు ఎవరూ లేరు. నలుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. ఆ నలుగురూ పదవులు ఆశిస్తున్నారు. అంతేగాకుండా ఒకరిపై మరొకరు వివిధ ఆరోపణలు చేసుకుంటుండగా అందులో ఎవరిని విభాగం అధిపతిగా, బీఓఎస్‌గా నియమించాలని అధికారులు ఎటుతేల్చుకోలేకపోతున్నారు. దీనిపై కమిటీని నియమించి రిపోర్టు ఆధారంగా ఆ పదవుల్లో ఇద్దరు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించాలని అధికారులు యోచిస్తున్నారని తెలిసింది. అప్పటివరకు ఇన్‌చార్జ్ విభాగం అధిపతిగా యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బి. సురేశ్‌లాల్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్ పదవిలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్

విద్యారణ్యపురి : కాజీపేట మండలం తరాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.అరుణకు షోకాజ్ నోటీస్ జారీచేసినట్లు హనుమకొండ డీఈఓ వాసంతి తెలిపారు. సంక్రాంతి సెలవుల అనంతరం శనివారం నుంచి పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళలో ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఉదయం పూట 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించలేదనే ఫిర్యాదు మేరకు సదరు హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్ జారీచేసినట్లు డీఈఓ వెల్లడించారు. ఈనెల 18వ తేదీనుంచి ఉదయం, సాయంత్రం పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఇదివరకే ఆదేశించామని తెలిపారు. హెచ్‌ఎంపై క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని డీఈఓ పేర్కొన్నారు.

'కాల్వపల్లి' కన్నీరు

ముగిసిన దామోదర్ ఉద్యమ ప్రస్థానం | **ఎన్‌కౌంటర్‌లో కన్నుమూసిన మావోయిస్టు అగ్రనేత**

- రెండు రాష్ట్రాల్లో ఆయనపై రూ.50 లక్షల రివార్డు
- ఇటీవల దామోదర్ తల్లిని కలిసిన ఎస్పీ
- లొంగిపోవాలని వేడుకున్న తల్లి
- ఇంతలోనే మృతి చెందినట్లు మావోల ప్రకటన


కాల్వపల్లి గ్రామం


దామోదర్ ఇంటి ముందు తల్లి బతుకమ్మ

ములుగు/ఎస్ఎస్‌తాడ్వాయి: సీపీఐ(మావోయిస్టు) పార్టీ ఉద్యమ చరిత్రలో బడే దామోదర్ అలియాస్ చొక్కారావుది ఓ మరపురాని అధ్యాయం. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని పూజారి కాంకేర్ నక్సల్స్ క్యాంపుపై గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు భద్రతా దళాలు మెరుపు దాడి జరిపిన విషయం తెలిసిందే. ఈఘటనలో ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన మావోయిస్టు కీలకనేత, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే దామోదర్ అలియాస్ చొక్కారావు మృతి చెందినట్లు శనివారం కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మవోయిస్టు) ఒక ప్రకటనలో పేర్కొంది. ఆయన మరణ వార్త సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో కాల్వపల్లి ఉలిక్కిపడింది. బంధువులు, గ్రామస్తులు స్నేహితులు ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

సిద్ధాంతానికి కట్టుబడి మూడు దశాబ్దాలు

కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే ఎల్లయ్య, బతుకమ్మ కుమారుడు దామోదర్ ఆలియాస్ చొక్కారావు. ఏటూరునాగారం ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి పూర్తి చేశాడు. గోవిందరావుపేటలో ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడయ్యాడు. 1977లో బడే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్ స్ఫూర్తితో కొత్తగూడెం లోకల్ గెరిల్లా స్క్వాడ్ (ఎల్‌జీఎస్) కమిటీలో చేరాడు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమిటీ దళ కమాండర్‌గా ఎదిగాడు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పోలీసులకు కొరకరాని కొయ్యగా మారాడు. ఆయన ఆధ్వర్యంలో ఎంతో మంది పార్టీలో చేరగా.. మోస్ట్‌వాంటెడ్ లిస్టులో తెలంగాణ ప్రభుత్వం రూ.20 లక్షలు, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.30 లక్షల రివార్డులు ప్రకటించాయి. సుమారు మూడు దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆయన మృతి చెందాడన్న వార్త కలకలం రేపింది.

ఇటీవల దామోదర్ తల్లిని కలిసిన ఎస్పీ

డిసెంబర్ 27న ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఇన్‌చార్జ్ ఓఎస్డీ, ములుగు డీఎస్పీ రవీందర్.. కాల్వపల్లిలో దామోదర్ తల్లి బతుకమ్మను కలిశారు. దామోదర్ లొంగిపోతే ప్రభుత్వం తరఫున పునరావాసం కల్పించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా 'ఇంటికి రా కొడుకా' అని బతుకమ్మ కంటనీరు పెట్టుకుంటూ వేడుకుంది. ఇంతలోనే దామోదర్ మృతి చెందినట్లు వార్త విన్న బతుకమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది.


దామోదర్ తల్లి బతుకమ్మతో ఎస్పీ (ఫైల్)

కాల్వపల్లిలో ముగిసిన మావోయిస్టు కుటుంబాల ప్రస్థానం


కాల్వపల్లిలో మావోయిస్టుల అమరవీరుల స్తూపం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టుల కంచుకోటగా పేరుగాంచిన కాల్వపల్లిలో చివరి ఉద్యమ నాయకుడిగా ఉన్న బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతి చెందడంతో కాల్వపల్లిలో మావోయిస్టు కుటుంబాల ప్రస్థానం ముగిసినట్టయ్యింది. 1980 దశకం నుంచి ఉద్యమానికి ఊపిరిగా కాల్వపల్లి నిలిచింది. కాగా.. ఏల్‌జీఎ, పీఏల్‌జీఏ, పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీల్లో కింది స్థాయి నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో డివిజనల్ కమిటీ సభ్యులుగా కొనసాగిన బడే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్, బడే మురళి అలియాస్ పున్నంచందర్, సిద్ధబోయిన భరతక్క అలియాస్ సారక్క, సిద్ధబోయిన అశోక్ అలియాస్ శ్రీధర్ గతంలోనే మృతి చెందారు. దీంతో కాల్వపల్లిలో మావోయిస్టుల ప్రస్థానం ముగిసినట్లయ్యింది.

కుంభమేళాకు మన రైళ్లు

- 20 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు..
- పలు రూట్లలో పుష్‌పుల్లు రద్దు

కాజీపేట రూరల్ : కుంభమేళా ప్రయాణికుల రద్దీకి మన రైళ్లు నడిపించనున్న నేపథ్యంలో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు పలు రూట్లలో పుష్‌పుల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు శనివారం తెలిపారు. ఈ రైళ్లను నార్త్ సెంట్రల్ రైల్వేకు తరలించి అక్కడి నుంచి కుంభమేళా ప్రయాణికుల కోసం నడిపించనున్నట్లు వారు తెలిపారు.

కుంభమేళాతో రద్దయిన రైళ్లు

కాజీపేట-డోర్నకల్ (67765) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (67766) ప్యాసింజర్, డోర్నకల్-విజయవాడ (67767) ప్యాసింజర్, విజయవాడ-డోర్నకల్ (67768) ప్యాసింజర్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పండ్ల దుకాణంలో మంటలు

- సకాలంలో స్పందించి మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది


పండ్ల దుకాణంలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కాజీపేట : కాజీపేట ప్రధాన రహదారిపై ఓ పండ్ల దుకాణంలో శనివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో దుకాణంలోని ప్లాస్టిక్ ట్రేలు పూర్తిగా కాలిపోయాయి. మడికొండకు చెందిన పండ్ల వ్యాపారి జూల అశోక్.. కొక్కొండ ఉదయ్ కుమార్ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణంలో దాదాపు 50కి పైగా పండ్లు నిల్వ చేసే ప్లాస్టిక్ ట్రేలు ఉన్నాయి. విద్యుత్ వైర్ల నుంచి ఒక్కసారిగా నిప్పులు చెలరేగి ట్రేలపై పడడంతో మంటలు అంటుకున్నాయి. దీంతో అశోక్ బయటకు పరిగెత్తుకొచ్చి హనుమకొండ ఫైర్ ఇంజన్ అధికారులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది సకాలంలో ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పారు. పండ్ల దుకాణంపై భవనంలో ఉన్న స్టైలిష్ బట్టల దుకాణానికి పాక్షికంగా నష్టం వాటిల్లింది. ఎస్సై లవన్‌కుమార్ ప్రమాదస్థలికి చేరుకుని సిబ్బందితో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ ప్రమాదంలో భవనంతో పాటు రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28 పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ
- 5,632 మందికి 4,352 మంది విద్యార్థులు హాజరు
- 1,280 మంది గైర్హాజరు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న నవోదయ ప్రిన్సిపల్ పూర్ణిమ

ఖిలా వరంగల్: 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 5,632 మందికి గాను 4,352(88 శాతం) మంది హాజరై 1,280 మంది గైర్హాజరయ్యారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు నిర్వహించిన పరీక్ష సజావుగా జరిగింది. 80 సీట్లకు 4352 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు పర్యవేక్షకురాలు, నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ తెలిపారు. హనుకొండ, వరంగల్ మట్టెవాడ, గిర్మాజీపేట, కాశిబుగ్గ, శంభునిపేట, రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు స్పెషల్ స్క్వాడ్ అధికారులుగా వ్యవహరించారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష హాల్‌లోకి ప్రవేశించారు. ఆయా పరీక్షల సూపరింటెండెంట్‌లు ఏర్పాట్లు చేశారు. కాగా, పరీక్ష ప్రశాంతంగా జరిగిన నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగం, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులుకు నవోదయ ప్రిన్సిపాల్ పూర్ణిమ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బతుకుదెరువు కోసం వెళ్లి.. కానరానిలోకాలకు


- విద్యుత్‌షాక్‌తో హైదరాబాద్‌లో ఇనుగుర్తి వాసి మృతి
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు


బాలు(ఫైల్)

కేసముద్రం: బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన ఇద్దరు వ్యక్తులు అక్కడ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..ఇనుగుర్తి మండలం చీన్యాతండాజీపీ శివారు ఐలయ్యబావితండాకు చెందిన జాటోత్ బాలు(38), భార్య శాంత దంపతులకు కూతురు సౌమ్య, కుమారుడు ప్రణీత్ ఉన్నారు. బతుకుదెరువు నిమిత్తం కుటుంబంతో హైదరాబాద్ వెళ్లిన బాలు.. హబ్సిగూడలో ఉంటూ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాలు.. తన బావమరిది సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం దేవినిగుట్ట తండాకు చెందిన గుగులోత్ మల్లేశం(28)తో కలిసి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని హబ్సిగూడలో కూలీపనికి వెళ్లారు. ఓ భవనానికి ఉన్న బోర్డును తొలగిస్తున్న క్రమంలో విద్యుత్ తీగలకు తాకడంతో షాక్‌కు గురై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరి మృతదేహాల మీద పడి గుండెలవిసేలా రోదించారు. ఇక తమకు దిక్కెవరంటూ బోరున విలపించారు. కాగా, మల్లేశానికి భార్య చంద్రకళ, కుమారుడు అనిల్, కూతురు పల్లవి ఉన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరు మహిళలు దుర్మరణం
- ఆరెపల్లి సమీపంలో ఘటన


కనకలక్ష్మి(ఫైల్)


సాంబలక్ష్మి(ఫైల్)

వరంగల్: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందగా ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం వరంగల్ ఆరెపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ ఎ.రాఘవేందర్ కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన గంధ్రతి కనకలక్ష్మి(67), భూపతి సాంబలక్ష్మి(65) నగరంలో చీపుర్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈక్రమంలో చీపుర్ల కొనుగోలు నిమిత్తం కరీమాబాద్‌కు చెందిన పుదారి భీమయ్య ఆటోలో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో ఆరెపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా హనుమకొండ నుంచి భూపాలపల్లి వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు.. ఆటోను ఢీకొంది. ఈ క్రమంలో కనకలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, సాంబలక్ష్మి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆటో డ్రైవర్ భీమయ్య చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై మృతురాలు కనకలక్ష్మి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ రాజబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎ.రాఘవేందర్ తెలిపారు.

నేడు హనుమకొండలో లలితా జ్యువెల్లరీ ప్రారంభం


అమ్మవారి సన్నిధిలో కిరణ్‌కుమార్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ రాయపురలో నేడు (ఆదివారం) ఉదయం 9.30 గంటలకు లలితా జ్యువెల్లరీ నూతన షోరూంను ప్రారంభిస్తున్నట్లు లలిత జ్యువెల్లరీ మార్ట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రారంభానికి ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

అమ్మవారి సన్నిధిలో..

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయాన్ని శనివారం లలిత జ్యువెల్లర్స్ అధినేత కిరణ్‌కుమార్ సందర్శించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం కిరణ్‌కుమార్‌కు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్ : సంగీతంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ విద్యారణ్య అర్షధర్మ రక్షణ సంస్థ ఆధ్వర్యంలో సద్గురు శ్రీత్యాగరాజ స్వామివారి 178వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సామా జగన్మోహన్ స్మారక భవనంలో సంస్థ అధ్యక్షుడు నకిరేకంటి రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి విశిష్టఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ఆరాధనోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగీత ఉపాధ్యాయుడు లక్ష్మణాచారి త్యాగరాజస్వామి వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో వరంగల్ సీపీ అంబర్‌కిశోర్‌ఝా, అజరా హాస్పిటల్ చైర్మన్ అప్పాల సుధాకర్, సంగీత విద్వాంసులు తిరుపతయ్య, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ బి. వివసుబ్రహ్మణ్యం, ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు, లలితా జ్యువెలర్స్ అధినేత కిరణ్‌కుమార్, వర్ధమాన గాయకులు జొన్నలగడ్డ సత్యశ్రీరాం, రాంపల్లి కౌస్తుభ తదితరులు పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్లకు శిక్షణ


మాట్లాడుతున్న హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్‌బాబు

వరంగల్ లీగల్ : హనుమకొండ కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పారాలీగల్ వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథులుగా హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు రమేశ్‌బాబు, నిర్మల గీతాంబ హాజరై వలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కమిటీ సభ్యులు తమ బాధ్యతలు, సూచనలు, సలహాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ రెండు జిల్లాల కార్యదర్శులు క్షమాదేశ్ పాండే, ఎం.సాయికుమార్, సివిల్ జడ్జి ఉపేందర్, సుభాష్, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఏటూరునాగారం డిపోనకు నిధులు మంజూరు

- రూ.6.28 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ములుగు బస్ స్టేషన్‌కు రూ.5.11 కోట్లు


బస్ డిపో ఏర్పాటు చేయనున్న స్థలం ఇదే..

హన్మకొండ: వరంగల్ రీజియన్‌లో మరో డిపో ఏర్పాటునకు తుదిరూపు దిద్దుకుంది. దీంతో రీజియన్‌లో బస్ డిపోల సంఖ్య పదికి చేరుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వం 2024 డిసెంబర్ 3న ఏటూరునాగారంలో డిపో నిర్మాణానికి అనుమతిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. అయితే నిధుల విషయంపై ఆ జీఓలో స్పష్టంగా పేర్కొనలేదు. తర్వాత ఆర్టీసీ యాజమాన్యం నుంచి డిపో నిర్మాణంపై పూర్తి స్థాయి డీపీఆర్ పంపాలని వరంగల్ రీజియన్‌కు ఆదేశాల రాగా ఏటూరునాగారం బస్ డిపో, ములుగు బస్ స్టేషన్ నిర్మాణంపై డీపీఆర్ తయారు రూపొందించి పంపారు. ఈ క్రమంలో శనివారం హైదరాబాద్ బస్ భవన్‌లో జరిగిన టీజీఎస్ ఆర్టీసీ బోర్డ్ మీటింగ్‌లో ఏటూరునాగారం బస్ డిపో మంజూరుకు నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. బస్ డిపో నిర్మాణానికి రూ.6.28 కోట్లు, ములుగు బస్ స్టేషన్ నిర్మాణానికి రూ.5.11 కోట్లు, మంగపేట బస్ స్టాండ్ నిర్మాణానికి రూ.51 లక్షలు, కాళేశ్వరం బస్ స్టేషన్ ఆధునీకరణకు రూ.3.90 కోట్లు మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఆర్టీసీ వరంగల్ రీజియన్ అధికారులను సంప్రదించగా తమకు కూడా సమాచారం తెలిసిందన్నారు. అయితే అధికారికంగా ఎలాంటి ఆర్డర్లు రాలేదని తెలిపారు. ప్రస్తుతం హనుమకొండ వరంగల్-2డిపోనకు చెందిన బస్సులు ఏటూరునాగారం చేరుకుని అక్కడి నుంచి వివిధ గ్రామాలకు రవాణ సేవలు అందిస్తున్నాయి. ఏటూరునాగారం డిపో ఏర్పాటుతో హనుమకొండ నుంచి ఏటూరునాగారం వరకు వెళ్లే బస్సుల ఇంధన ఖర్చులు ఆదాకానున్నాయి. స్థలం అందుబాటులో ఉండడంతో పనులు కూడా త్వరలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. రెండు మూడు రోజుల్లో టెండర్లు పిలిచే అవకాశమున్నట్లు సమాచారం.

అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రులకు రుణపడి ఉంటా : మంత్రి సీతక్క

ఏటూరునాగారం: ములుగు జిల్లాలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తున్న ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రుణపడి ఉంటానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు, మంగపేట బస్టాండ్, ఏటూరునాగారం బస్‌డిపో నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మోక్షం కలిగిందని తెలిపారు. తమ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే పనులు చేపడుతామని తెలిపారు. కాగా, మంత్రి సీతక్క కృషితోనే ములుగు, మంగపేట బస్టాండ్ నిర్మాణానికి, ఏటూరునాగారం బస్ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలుపడంతో పాటు నిధులు మంజూరు చేసిందని డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ తెలిపారు.

కామన్‌మెస్‌లో బయోమెట్రిక్ అటెండెన్స్

- విద్యార్థులు మెస్‌కార్డు తీసుకురావాల్సిందే..


బయోమెట్రిక్‌లో మెస్ కార్డులు స్కాన్ చేస్తున్న సిబ్బంది

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని కామన్‌మెస్‌లో విద్యార్థులకు శనివారం నుంచి బయోమెట్రిక్ అటెండెన్స్ అమలుచేస్తున్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ సమయంలో విద్యార్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే విద్యార్థులు తమ వెంట మెస్‌కార్డును తీసుకొస్తే బయోమెట్రిక్‌లో సిబ్బంది స్కాన్ చేస్తారు. దీంతో నాన్‌బోర్డర్లకు మెస్‌లోకి ఇక అనుమతి ఉండబోదని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. రోజూ మెస్‌కార్డును తప్పనిసరిగా తీసుకుని రావాల్సి ఉంటుంది. సుమారు 13వందల మందికిపైగా విద్యార్థులకు కామన్ మెస్ సదుపాయం కల్పిస్తున్నారు. ఇదిలాఉండగా ఈ బయోమెట్రిక్ పనితీరును కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, హాస్టళ్ల డైరెక్టర్ సీహెచ్. రాజ్‌కుమార్ పరిశీలించారు. మరో వారం రోజుల్లో పద్మాక్షి మహిళా హాస్టల్ మెస్‌లో కూడా ఈ బయోమెట్రిక్ విధానం అమలుచేయాలనే యోచనలో ఉన్నారు. ఆ తరువాత కేయూ ఇంజనీరింగ్ హాస్టల్ కూడా అమలు చేయబోతున్నారు.

ఒకే రోజు మూడు బైక్‌ల చోరీ

- మహబూబాబాద్‌లో ఘటన
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్ : ఒకే రోజు మూడు బైక్‌లు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్‌లో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బ్లెస్డ్ చర్చి సమీపంలో నివాసముండే దుర్గం సాయికుమార్ ద్విచక్ర వాహనాన్ని తన మిత్రుడు తీసుకెళ్లాడు. ఆ వాహనాన్ని కురవి గేట్ సమీపంలో గల తమ ఇంటి ప్రాంగణంలో పార్క్ చేశాడు. శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ఆ వాహనాన్ని అపహరించారు. అదే విధంగా వ్యవసాయ మార్కెట్ ఎదుట గల కుంట అంజయ్యకు చెందిన టీవీఎస్ ఎక్సెల్ సూపర్, హీరో గ్లామర్ రెండు ద్విచక్రవాహనాలను అపహరించుకెళ్లారు. ఈ ఘటనలపై బాధితులు టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. కాగా, వారం రోజుల వ్యవధిలో జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో 10 ద్విచక్ర వాహనాలు అపహరణకు గురైనట్లు తెలిసింది.